కేరళ తరహా రాజకీయాలు దేశానికి అవసరం

- భారతీయ సమాజ మనుగడ ఎలా ఉండాలో చెతుతన్న మళయాళ సమాజం
- పుస్తకావిష్కరణ సభలో సిఎం రేవంత్ రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేరళ తరహా రాజకీయాలు ప్రస్తుతం దేశానికి చాలా అవసరమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. సైద్ధాంతికంగా ఎన్ని వైరుధ్యాలున్నప్పటికీ అక్కడి రాజకీయ పార్టీలు, ప్రజలు మతోన్మాదులకు మాత్రం అవకాశమివ్వలేదని కొనియాడారు. సోమవారం కేరళలోని కోజికోడ్‌లో ఇండియన్ యూనియన్ ముస్లీం లీగ్ (ఐయూఎంఎల్) కేరళ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన 'స్నేహ సదస్సు'లో రేవంత్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. సయ్యద్ సాదిఖలీ షాహిబ్ తంగల్ రాసిన 'స్నేహ సదస్సు' పుస్తకాన్ని ఆయన ఈ సందర్భంగా ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేరళ ప్రజలు మతోన్మాదులను ఏ మాత్రం భరించరనీ, తమ నాయకుడు ఈ రాష్ట్రం నుంచే పోటీ చేస్తున్నారని చెప్పారు. కేరళలో యునైటెడ్ డెమెక్రటిక్ ఫ్రంట్ (యుడిఎఫ్) మతోన్మాదులకు వ్యతిరేకంగా పోరాడుతూ ఇండియా అలయెన్స్‌కు మార్గదర్శకంగా నిలిచిందని తెలిపారు. ఐయుఎంఎల్ గత 40 ఏండ్లుగా కాంగ్రెస్ వెంటే ఉందనీ, ఇలాంటి నమ్మకమైన స్నేహితుడు పక్కన ఉంటే మోడీ అయినా, అంతకు మించిన మతోన్మాదినైనా ఎదుర్కొంటామని ధీమా వ్యక్తం చేశారు.

మతోన్మాదులపై పోరాటానికి సంబంధించి తాను కేరళ నుంచి నేర్చుకోవాలనుకుంటున్నట్టు చెప్పారు. కేరళకు వచ్చిన ప్రతిసారీ మతోన్మాదులను ఓడించేందుకు వీలుగా ఏదో ఒక రకమైన స్ఫూర్తిని పొంది వెళ్తున్నానని తెలిపారు. ప్రధానమంత్రి హోదాలో ఉండి మోడీ పదే పదే దేశాన్ని విచ్ఛిన్నం చేసే వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు. ప్రధాని కాకముందే ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధులుగా వారి భావజాలలకు అనుగుణంగా వ్యాఖ్యలు చేస్తే అది వారికే పరిమితమవుతుందని తెలిపారు. అయితే ప్రధాని అయిన వ్యక్తి ప్రజలందరి ఆసక్తిని గుర్తించి కాపాడేవారై ఉండాలని హితవు పలికారు. కేరళలోకి చొచ్చుకొచ్చేందుకు మోడీ బాధ్యాతారహితంగా మాట్లాడారనీ, ఇక్కడి ప్రజలు మాత్రం ఇంచు కూడా మతోన్మాదులకు దక్కకుండా అడ్డుకున్నారని అభినందించారు. ఇలాంటి చర్యలతో కేరళ దేశానికి ఆదర్శంగా నిలిచిందని ప్రశంసించారు. సమాజాన్ని ఎలా కాపాడుకోవాలనే విషయాన్ని భారతదేశం, కేరళ నుంచి నేర్చుకోవాలని అభిప్రాయపడ్డారు. స్నేహ సదస్సు మినీ ఇండియాను, ఇండియా అలయెన్స్‌ను, సెక్యులర్ ప్లాట్‌ఫాంను తలపిస్తున్నదని ప్రశంసించారు. ఇలాంటి సందేశాన్ని కోట్లాది మందికి చేర్చాలని ఆకాంక్షించారు.

దిగజారిన రాజకీయాలు

ఎన్నికల్లో గెలుపోటములు సహజమని రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా అన్నారు. అయితే మతోన్మాదులు ఎన్నికల్లో గెలిచేందుకు దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలోని భిన్నత్వంలో ఏకత్వాన్ని వారు అర్థం చేసుకోవడంలేదని విమర్శించారు. బిజెపి నేతలు 400 ఎంపి సీట్లు తమకు వస్తాయని ఊదరగొడుతున్నారనీ, రాజ్యాంగాన్ని మార్చడం, రిజర్వేషన్లను రద్దు చేసేందుకే ఈ తతంగమని, అయితే వారి కలలు కల్లలు కాబోతున్నాయని రేవంత్ వ్యాఖ్యానించారు. 130 వరకు స్థానాలున్న కేరళ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక తదితర రాష్ట్రాలు కలిపి మతోన్మాదులు 20 కూడా దాటబోరని చెప్పారు. ఇక గతంలో ఏకపక్షంగా ఎన్డీఏ గెలిచిన గుజరాత్, రాజస్థాన్, ఢిల్లీ, హర్యానా తదితర రాష్ట్రాల్లో వారి బలం సగానికి సగం తగ్గిపోబోతున్నదని తెలిపారు. ప్రజల ఆకాంక్షలను అర్థం చేసుకోకుండా పదేండ్లపాటు తెలంగాణను పాలించి ఎన్నికల్లో ప్రజల ఆకాంక్షలకు భిన్నంగా మాట్లాడిన మాజీ సిఎం కెసిఆర్ మాదిరిగానే, పార్లమెంటు ఎన్నికల్లో ప్రధాని మోడీ కూడా దుర్భాషలాడారని విమర్శించారు. తెలంగాణలో బిఆర్ఎస్ ఓడిపోయినట్టుగానే, కేంద్రంలో బిజెపి నేతృత్వంలోని ఎన్డీయే కూటమి ఓడిపోబోతుందని చెప్పారు.

నెహ్రూ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సిఎం రేవంత్

జవహర్ లాల్ నెహ్రూకు సిఎం ఘన నివాళి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మాజీ ప్రధాని పండిత జవహర్ లాల్ నెహ్రూ వర్ధంతి సందర్భంగా సిఎం రేవంత్ రెడ్డి ఆయనకు నివాళులర్పించారు. సోమవారం ఉదయం హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో నెహ్రూ చిత్రపటానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఎఐసిసి కార్యదర్శి సంపత్ కుమార్, ఎమ్మెల్యే శ్రీహరి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రావి నారాయణరెడ్డికి నివాళి

ప్రజాశక్తి -.కల్చరల్

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు రావి నారాయణరెడ్డి అని త్యాగరాయ గాన సభ అధ్యక్షులు కళావిఎస్ జనార్ధనమూర్తి అన్నారు. శతాబ్దిపూర్వ మహనీయుల యాధిలో కార్యక్రమంలో భాగంగా ప్రముఖ కమ్యూనిస్టు నేత, తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, పూర్వ లోకసభ సభ్యుడు, పద్మవిభూషణ్ రావి నారాయణరెడ్డి సంస్మరణ సమావేశం గాన సభ నిర్వహణలో త్యాగరాయ గాన సభలోనీ కళా లలిత కళా వేదికపై జరిగింది. ముందుగా రావి నారాయణరెడ్డి చిత్ర పటానికి నివాళులర్పించిన అనంతరం కళావిఎస్ జనార్ధన్‌మూర్తి మాట్లాడుతూ.. చరిత్రాత్మక తెలంగాణ సాయుధ పోరాటంలో రావి నారాయణరెడ్డి అగ్రభాగాన ఉండి నైజాం నిరంకుశ పాలనను, భూస్వామ్య వ్యవస్థ అంతమొందించే వరకు అలుపెరుగని పోరాటాలు చేశాడని గుర్తు చేశారు. ప్రముఖ గాయని ఆమని మాట్లాడుతూ హైదరాబాద్ స్టేట్‌లో గ్రామగ్రామాన రైతాంగ పోరాటాన్ని పెను తుపానులా హోరెత్తించిన విప్లవ వీరుడు, హైదరాబాదు సంస్థానంలో విధ్వంసకాండతో నరమేధం సృష్టించిన రజాకార్ల ఆకృత్యాలను అరికట్టడానికి అజ్ఞాతంగా ఎన్నో గెరిల్లా దళాలను ఏర్పాటు చేసి వ్యక్తి రావి నారాయణరెడ్డి అని అన్నారు. 1951-52లో తొలి సార్వత్రిక ఎన్నికల్లో కమ్యూనిస్టు అభ్యర్థిగా నల్గొండ లోక్‌సభ నియోజకవర్గం నుండి పోటీ చేసి నాటి ప్రధాని నెహ్రు కంటే ఎక్కువ ఓట్లు సాధించి పార్లమెంటులో తొలి అడుగుపెట్టిన ఘనత రావి నారాయణరెడ్డి సాధించాడని చెప్పారు. తన 500 ఎకరాల సొంత భూములను పేదలకు దానం చేసి అణగారిన వర్గాలకు అండగా నిలిచినా రావి నారాయణరెడ్డి ఆశయాలను కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సత్యనారాయణ మూర్తి, హైకోర్టు న్యాయవాది, ప్రముఖ గాయని తోట శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఖరారైన తెలంగాణ అధికారిక చిహ్నం

- తుది మెరుగులు దిద్దుతున్న ప్రముఖ చిత్రకారులు రుద్ర రాజేశం
- పలు మార్పులు సూచించిన సిఎం
- జూన్ 2న ఆవిష్కరణకు సిద్ధం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ అధికారిక చిహ్నం దాదాపు ఖరారైంది. ప్రముఖ చిత్రకారులు రుద్ర రాజేశం ఈ చిహ్నానికి తుది మెరుగులు దిద్దుతున్నారు. ఈ మేరకు సోమవారం ఆయన బృందంతో సీఎం రేవంత్ రెడ్డి సమావేశమయ్యారు. ఇందుకు సంబంధించి రూపొందించిన 12 నమూనాల్లో ఒకదాన్ని ఆయన ఖరారు చేశారు. ఎంపిక చేసిన దాంట్లో కొన్ని మార్పులు చేయాలని వారికి సూచించారు. గత చిహ్నంలో చార్మినార్, కాకతీయ తోరణాలు ఉన్నాయి. అయితే రాజరిక ముద్రలకు ప్రత్యామ్నాంగా ప్రజాస్వామ్యం, తెలంగాణ ఉద్యమం, త్యాగధనుల బలిదానాలు ప్రతిబింబించేలా అది ఉండాలని సిఎం భావిస్తున్నారు. ఆయన సూచనలకు అనుగుణంగా ఎంపిక చేసిన దానిలో మార్పులు చేస్తున్నారు. తెలంగాణ ఏర్పడి పదేళ్లు గడుస్తున్న నేపథ్యంలో జూన్ 2న ఈ చిహ్నాన్ని ఆవిష్కరించనున్నారు. ఈ లోపు పూర్తి చేశారు.

రాష్ట్ర గీతంగా 'జయ జయహే'

తెలంగాణ రాష్ట్ర గీతంగా ప్రముఖ కవి అందెశ్రీ రాసిన "జయ జయహే తెలంగాణ" గీతాన్ని ఇటీవల సిఎం ఖరారు చేశారు. ఈ నేపథ్యంలో ప్రముఖ సంగీత దర్శకులు ఎంఎం కీరవాణికి దాని బాధ్యతలు అప్పగించారు. సిఎం సూచనల మేరకు గీత రచయిత అందెశ్రీ భావం, భావోద్వేగం మారకుండా రెండు నిమిషాల్లో పూర్తయ్యేలా దానికి మార్పులు చేశారు. సీఎం, అందెశ్రీ సూచనలకు అనుగుణంగా కీరవాణి స్వరకల్పన చేస్తున్నారు. మరో వైపు తెలంగాణ తల్లి విగ్రహం రూపకల్పన కూడా తుది దశకు చేరుకున్నట్టు సమాచారం. రాష్ట్ర చిహ్నం, రాష్ట్ర గీతం, తెలంగాణ తల్లి విగ్రహం మొత్తం మూడింటినీ జూన్ 2న ఆవిష్కరించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్నది. ఇందు కోసం అధికారులకు సీఎం ప్రత్యేక బాధ్యతలు అప్పగించి నట్టు సమాచారం

రెమ్యూనరేషన్‌ను వెంటనే చెల్లించాలి

- సిఎం రేవంత్‌రెడ్డికి టిజిజెఎల్ఎ వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఇంటర్ వార్షిక పరీక్షల విధుల్లో పాల్గొన్న వారికి రెమ్యూనరేషన్‌ను వెంటనే చెల్లించాలని తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్ల సంఘం (టీజీజేఎల్ఏ-475) రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కొప్పిశెట్టి సురేష్ ఆన్‌లైన్ ద్వారా సోమవారం వినతిపత్రం పంపించారు. ఫిబ్రవరి, మార్చిలో ఇంటర్ వార్షిక పరీక్షలు జరిగాయని తెలిపారు. కానీ ఇంత వరకు రెమ్యూనరేషన్ అందలేదని ఆందోళన వ్యక్తం చేశారు. విధుల్లో పాల్గొన్న ప్రయివేటు కాలేజీల్లో పనిచేస్తున్న వారు, స్వీపర్లు, వాటర్ బాయ్స్, అటెండర్లు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. రెండేండ్ల క్రితం వార్షిక పరీక్షల విధులు నిర్వహించిన వారికి వెంటనే రెమ్యూనరేషన్ చెల్లించేవారని గుర్తు చేశారు. రెండేండ్ల నుంచి ఆన్‌లైన్ విధానాన్ని ప్రవేశపెట్టి ఐదారు నెలల వరకు రెమ్యూనరేషన్‌ను చెల్లించడం లేదని వివరించారు. ఈ సమస్యను పరిష్కరించాలంటూ విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి, ఇంటర్ బోర్డు కార్యదర్శిని పలుమార్లు కలిసి వినతిపత్రాలు సమర్పించామని తెలిపారు. ఇంత వరకు పరిష్కారం కాలేదని పేర్కొన్నారు. ఈనెల 24 నుంచి ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభమయ్యాయని పేర్కొన్నారు. వచ్చేనెల ఒకటో తేదీ నుంచి మూల్యాంకనం ప్రారంభమవుతుందని తెలిపారు. కానీ సకాలంలో రెమ్యూనరేషన్‌ను చెల్లించడంలో ఇంటర్ బోర్డు శ్రద్ధ చూపడం లేదని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జోక్యం చేసుకుని రెమ్యూనరేషన్‌ను వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

మూల్యాంకనం కేంద్రాల వద్ద దశలవారీ కార్యక్రమాలు

ఇంటర్ వార్షిక పరీక్షల్లో పాల్గొన్న వారికి రెమ్యూనరేషన్ చెల్లించాలంటూ వచ్చేనెల ఒకటో తేదీ నుంచి మూల్యాంకనం కేంద్రాల వద్ద దశలవారీ కార్యక్రమాలను నిర్వహిస్తామని వి శ్రీనివాస్, కొప్పిశెట్టి సురేష్ తెలిపారు. పెండింగ్‌లో ఉన్న రెమ్యూనరేషన్‌ను వెంటనే చెల్లించాలని కోరారు.

మోడల్ స్కూళ్లలో ఇంటర్ ప్రవేశాల దరఖాస్తు గడువు 31 వరకు పొడిగింపు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని మోడల్ స్కూళ్లలో ఇంటర్ ప్రథమ సంవత్సరం 2024-25 విద్యాసంవత్సరంలో ప్రవేశాలకు సంబంధించి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ గడువును ఈనెల 31 వరకు ప్రభుత్వం పొడిగించింది. ఈ మేరకు మోడల్ స్కూళ్ల అదనపు సంచాలకులు ఎస్ శ్రీనివాసాచారి సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు అర్హులని తెలిపారు. విద్యార్థులకు ఇంగ్లీష్ మాధ్యమంలో ఉచిత విద్యనందిస్తున్నామని పేర్కొన్నారు. ఎంపిసి, బైపిసి, ఎంఇసి, సిఇసి కోర్సుల్లో ఒక్కో గ్రూపులో 40 సీట్ల చొప్పున ఉంటాయని వివరించారు. వచ్చేనెల ఐదు నుంచి ఏడో తేదీ వరకు ఒరిజినల్ ధ్రువపత్రాల పరిశీలన ఉంటుందని తెలిపారు. ఇతర వివరాల కోసం www.tsmodelschools.com వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

'మేడిగడ్డ'ను సందర్శించిన ఇంజనీరింగ్ చీఫ్ బృందం

- బ్యారేజీ పునరుద్ధరణ పనుల పరిశీలన
- వర్షాకాలం కన్నా ముందే పనులు పూర్తిచేయాలన్న ఎన్‌డిఎస్ఎ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండల పరిధి కాళేశ్వరం ప్రాజెక్టు మేడిగడ్డ లక్ష్మీ బ్యారేజ్‌ని ఇంజనీరింగ్ చీఫ్ బృందం సభ్యులు సోమవారం పరిశీలించారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ ఆదేశాల మేరకు ఇఎన్‌సి అనిల్‌కుమార్ నేతృత్వంలో సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్ ఆరుగురు సభ్యుల బృందం మేడిగడ్డ బ్యారేజీని సందర్శించి క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. బ్యారేజీపై కుంగిన వంతెన, ఏడవ బ్లాక్‌లో దెబ్బతిన్న పిల్లర్లను పరిశీలించి, కుంగుబాటుకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. పునరుద్ధరణ పనుల సమయంలో గుర్తించిన బొరియలు, కుంగిన పిల్లర్స్, గేట్ల స్థితిగతులను క్షుణంగా పరిశీలన చేసి వాటి ఫుటేజీలను సేకరించారు. మేడిగడ్డ బ్యారేజీ ఎగువ, దిగువ ప్రాంతాల్లో ఉన్న తాజా పరిస్థితులను పరిశీలించారు. బ్యారేజీలోని 15 నుంచి 21వ పిల్లర్లు, గేట్ల వద్ద ఇసుక మేట్‌లను అధికారులు తొలగించి.. గేట్ల మరమ్మతు పనులను పరిశీలించారు. 20, 21వ పిల్లర్ల మధ్యలో యంత్రాల ద్వారా కౌంటింగ్ పనులు చేస్తున్నారు. భూగర్భంలో ఎంతవరకు ఇసుక నిల్వలు ఉన్నాయో ఈ కౌంటింగ్ ద్వారా తెలుస్తుందని ఇంజనీరింగ్ అధికారులు చెబుతున్నారు. బ్యారేజీ దిగువన నీటి ప్రవాహాన్ని తట్టుకునే విధంగా సీసీ బ్లాక్‌లో పనులు జరుగుతున్నాయి. బ్యారేజీ పిల్లర్ల దిగువన ఉన్న స్ట్రీమ్ వాల్ కొట్టుకుపోకుండా ఉండేందుకు డ్రిల్లింగ్ చేసి కాపర్ షీట్లను భూమిలోకి పంపుతున్నారు. సీట్ల వెనుక భాగంలో సిసి పనులను చేస్తున్నారు. ఉబికి వస్తున్న నీటిని భారీ యంత్రాల సహాయంతో తోడేస్తున్నారు. వర్షాకాలం సీజన్ మొదలు కాకముందే పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎన్‌డిఎస్ఎ అధికారులు ఇంజనీరింగ్ అధికారులకు, నిర్మాణ సంస్థ ఎల్అండ్‌టి అధికారులకు సూచించారు. వారి వెంట నిపుణులు నాగేందర్, మోహన్, రామగుండం సిఇ సుధాకర్ రెడ్డి మేడిగడ్డ ఇఇ తిరుపతిరావు, డిఇలు, ఎఇలు, ఎల్అండ్ఎన్ సంస్థ ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.

మేడిగడ్డ లక్ష్మీ బ్యారేజ్‌ను పరిశీలిస్తున్న ఇంజనీరింగ్ చీఫ్ బృందం సభ్యులు

BEFORE THE HON' BLE DEPUTY REGISTRAR OF CHITS: BAPATLA

DISPUTE NO. 28/2022

Between:
M/s Shriram Chits Pvt Ltd.., Repalle .... Disputant
AndKancharla Anjaneyulu and others ...Opponents

3. chaladi venkata srinivas,
S/o Chaladi Tata Rao. hindu,
aged 37 years. Private Employee and
R/o D.No. 8-3-168/4/37. Bhavani Nagar,
Gokul Cinema Hall. Erragadda,
Hyderabad, Telangana.

Please take notice that the above dispute it filed against opponent no 3, for recovery of amount. The same is posted to Dt. 11.06.2024, for the appearance of you before the deputy registrar of chits office district registrar, bapatla at 10.30 a.m. if you fail to attend the office of Deputy Registrar of chits on that day the matter will be heard and decided exparte basis on the material available.

(By Order of the Deputy Registrar of chits)
Rep by its Legal Manager/GPA Holder.
Shriram Chits Pvt. Ltd. Repalle.

3 నుంచి టెన్త్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ

- 13 వరకు నిర్వహణ
- 51,237 మంది హాజరు
- 170 పరీక్షా కేంద్రాల ఏర్పాటు
- విద్యార్థులకు ఐదు నిమిషాల గ్రేస్ పీరియెడ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు వచ్చేనెల మూడో తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. అదేనెల 13 వరకు అవి కొనసాగుతాయి. ఈ మేరకు ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకులు ఎ కృష్ణారావు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ పరీక్షలను ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నిర్వహిస్తామని తెలిపారు. ఐదు నిమిషాలు ఆలస్యమైనా పరీక్షా కేంద్రాల్లోకి విద్యార్థులను అనుమతిస్తామని పేర్కొన్నారు. ఉదయం 9.30 గంటలకు పరీక్షలు ప్రారంభమైనా 9.35 గంటల వరకు విద్యార్థులకు గ్రేస్ పీరియడ్‌తో అనుమతి ఉంటుందని స్పష్టం చేశారు. ఆ తర్వాత వచ్చిన విద్యార్థులకు అను మతి ఉండబోదని తెలిపారు. ఫస్ట్ లాంగ్వేజ్ కాంపోజిట్ కోర్సు సబ్జెక్టు మాత్రం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.50 గంటల వరకు జరుగుతుందని పేర్కొన్నారు. సైన్స్ సబ్జెక్టును రెండు విడతల్లో రెండు రోజుల పాటు నిర్వహిస్తున్నామని వివరించారు. ఫిజికల్ సైన్స్, బయలాజికల్ సైన్స్‌ను సబ్జెక్టులను వేర్వేరు రోజుల్లో ఉదయం 9.30 నుంచి 11 గంటల వరకు నిర్వహిస్తామని తెలిపారు. ఈ పరీక్షలను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందు కు ఏర్పాట్లు పూర్తి చేశామని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 51,237 మంది విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరవుతారని వివరించారు. వారిలో 31,625 మంది అబ్బాయిలు, 19,612 మంది అమ్మాయిలు న్నారని తెలిపారు. వారి కోసం 170 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. 170 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 170 మంది డిపార్ట్ మెంటల్ అధికారులు, 1,300 మంది ఇన్విజిలేటర్లను నియమించామని వివరించా రు. మాల్‌ప్రాక్టీస్‌లను నివారించ డంతోపాటు పరీక్షల పర్యవేక్షణకు 38 మంది ఫ్లైయింగ్ స్క్వాడ్‌లను నియమించామని పేర్కొన్నారు. విద్యార్థుల హాల్‌టికెట్లను ఇప్పటికే ఆయా పాఠశాలలకు పంపించామని తెలిపారు. www.bse.telangana. gov.in వెబ్‌సైట్ నుంచి హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని సూచించారు. ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకుల కార్యాలయంలో కంట్రోల్ రూంను ఏర్పాటు సమస్యలుంటే 040-23230942 నెంబర్ ను సంప్రదించా లని కోరారు. విద్యార్థులను గంట ముందు నుంచే అంటే ఉదయం 8.30 నుంచి పరీక్షా కేంద్రాల్లోకి అనుమతిస్తామనీ, సకాలంలో చేరుకోవాలని సూచించారు. పరీక్షా కేంద్రాల్లోకి విద్యార్థులు, సిబ్బంది మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ గాడ్జెట్లను తేవడాన్ని నిషేధించామని పేర్కొన్నారు.

మతతత్వం కాదు.. మానవత్వం కావాలి

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సాగర్, రాష్ట్ర కమిటీ సభ్యులు బండారు రవికుమార్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మైనారిటీ.. మతోన్మాదం రెండూ ప్రమాదకరమే.. మతోన్మాదాన్ని పాలకవర్గాలే పెంచి పోషిస్తున్నాయి.. దానికి ప్రత్యామ్నాయంగా భావజాల రంగంలో విస్తృత పోరాటం జరగాలి.. దేశానికి మతతత్వం కాదు.. మానవత్వం కావాలి" అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సాగర్, రాష్ట్ర కమిటీ సభ్యులు బండారు రవికుమార్ అన్నారు. సోమవారం మహబూబ్‌నగర్, వనపర్తి జిల్లాల్లో సిపిఎం నాయకులు, కార్యకర్తలకు రాజకీయ శిక్షణాతరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సైద్ధాంతిక అంశాలను అధ్యయనం చేయాలన్నారు. స్వయంగా ప్రధాని మోడీనే ప్రజల మధ్య మత విద్వేషాలు రగిల్చేలా మాట్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆధిపత్య భావజాలమే కొనసాగాలనే విధంగా ఆయన ప్రసంగాలుంటున్నాయని చెప్పారు. మైనార్టీ ప్రజలను ద్వితీయ శ్రేణి పౌరులుగా ఉండాలనడం సరికాదన్నారు. బిజెపి హయాంలో చేసిన అభివృద్ధిపై చర్చించకుండా నిత్యం అబద్ధాలు ప్రచారం చేస్తూ ప్రజల దృష్టి మరల్చుతున్నారని విమర్శించారు. సామ్రాజ్యవాదం, మతోన్మాదం, కార్పొరేట్ శక్తులకు వ్యతిరేకంగా, ప్రజా సమస్యల పరిష్కారం కోసం విస్తృత పోరాటాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాల్లో సిపిఎం మహబూబ్‌నగర్ జిల్లా కార్యదర్శి ఏ.రాములు, నాయకులు కిల్లే గోపాల్, ఆర్.రామ్‌రెడ్డి, నల్లవెల్లి కురుమూర్తి, వి పద్మ, వనపర్తి జిల్లా కార్యదర్శి ఎండీ జబ్బార్, నాయకులు జి.వెంకటయ్య, ఎం.బాల్య నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న వక్తలు

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్), జంగారెడ్డిగూడెం వారి కోర్టులో

O.S. No. 74/2022

Between:
పెనుమాక సత్య దుర్గా జయలక్ష్మి -వాది
Vs
పెనుమాక లలితాంబ మరియు ఆరుగురు -ప్రతివాదులు

6వ ప్రతివాది: కనుపర్తి శ్రీ కౌశల్య, భర్త: రాజకుమార్, ఫ్లాట్ నెం. 403, భారతిరామ్ రెసిడెన్సీ, 3-3-110, రోడ్ నెం. 5-ఎ, ప్లైసంట్ పార్క్ కాలనీ, న్యూ ఫ్రెండ్స్ కాలనీ ఫేస్-II, అత్తాపూర్, హైదరాబాద్ - 500048.

పై నంబరు దావాలో 6వ ప్రతివాది అయిన మీకు తెలియచేయునది ఏమనగా, పై నంబరు దావా మీ పైన మరియు ఇంకా ఆరుగురి పైన వాది గారు దావాలో పరిహారము నిమిత్తం శ్రీ కోర్టు వారి ఎదుట దావా వేసి ఉన్నారు. సదరు దావాలో మీకు ఎన్నిసార్లు శ్రీ కోర్టు వారి ద్వారా సమన్లు పంపించినా మీరు తీసుకోనందున, మీ హాజరు నిమిత్తం ది. 28-06-2024 తేదీకి వాయిదా కలదు. కనుక ఆరోజు అనగా **ది. 28-06-2024వ తేదీన ఉదయం 10.30 ని॥లకు** పైన తెలిపిన శ్రీ కోర్టు వారి ఎదుట మీరు స్వయముగా గాని, మీ ప్లీడరు గారి ద్వారా గాని హాజరు అయి మీ తరపు సమాధానము దాఖలు చేసుకోవలెను. లేని యెడల మీ పరోక్షమున తీర్మానము చేయబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

పి.ఎస్.ఆర్.కె.లక్ష్మణరావు
అడ్వకేట్, 10-4-101, సుబ్బారెడ్డి కాలనీ
స్థలం: జంగారెడ్డిగూడెం జంగారెడ్డిగూడెం
తేది:27-5-2024 సెల్: 9440328779

సివిల్స్ అభ్యర్థులకు 23న స్కాలర్‌షిప్ టెస్ట్

- కొంగర ఎడ్యుకేషనల్ సొసైటీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కొంగర ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో సివిల సర్వీసెస్ పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థుల ఎంపిక కోసం ఉపకార వేతనాల (స్కాలర్‌షిప్ టెస్ట్) నిర్వహిస్తామని ఆ సొసైటీ చైర్మన్ కె గంగాధరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థుల ఎంపిక కోసం వచ్చేనెల 23న ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు స్కాలర్‌షిప్ టెస్టును నిర్వహిస్తామని పేర్కొన్నారు. డిగ్రీ ఉత్తీర్ణులైన వారు అర్హులని వివరించారు. ఎలాంటి రుసుం చెల్లించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ఏపీ, తెలంగాణలోని అన్ని జిల్లా కేంద్రాల్లో ఈ స్కాలర్‌షిప్ టెస్టును నిర్వహిస్తామని తెలిపారు. ఇతర వివరాల కోసం 9346777568 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

బాసర త్రిపుల్‌ఐటీ ప్రవేశాలకు నోటిఫికేషన్

- జూన్ 1 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ
- సమర్పణకు తుది గడువు 22
- ఆర్‌జియుకెటి బాసర విసి వెంకటరమణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ఆర్‌జియుకెటి) బాసర త్రిపుల్‌ఐటీలో 2024-25 విద్యాసంవత్సరంలో ఆరేండ్ల సమీకృత బీటెక్ కోర్సులో ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు సంబంధించిన నోటిఫికేషన్ విడుదలైంది. ఈ మేరకు ఆర్జీయూకేటీ ఉపకులపతి (విసి) వి వెంకటరమణ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వచ్చేనెల ఒకటో తేదీ నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమవుతుందని తెలిపారు. వాటి సమర్పణకు తుది గడువు అదేనెల 22 వరకు ఉందని పేర్కొన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు దరఖాస్తు చేయాలని సూచించారు. ఈ ఏడాది జూన్ ఒకటి నాటికి 18 ఏళ్లు నిండకుండా ఉన్న వారే దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని వివరించారు. ఎస్‌సి, ఎస్‌టిలకు మూడేళ్లు మినహాయింపు ఉంటుందని వివరించారు. వచ్చే విద్యాసంవత్సరంలో 1,500 సీట్లు భర్తీ చేస్తామని తెలిపారు. ఆన్‌లైన్/ మీసేవా/ విశ్వవిద్యాలయ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేయాలని కోరారు.

అసిస్టెంట్ రిజిస్ట్రార్ వారి కార్యాలయం
ఫర్మ్స్ సొసైటీస్ & చిట్స్, వారణాసి డివిజన్, వారణాసి

సమాచారం

ఇందుమూలంగా సర్వజనులకు తెలియజేయబడుచున్నది ఏమనగా, ఎన్నికల కొరకు ప్రొవిజనల్ జాబితా ప్రకారం శ్రీ కాశి అన్నపూర్ణ వాసవి ఆర్య వైశ్య వృద్ధ ఆశ్రమం & నిత్యాన్నసత్రం, డోర్ నం..47/195, మజ్దా టాకీస్ ఎదురు బస్తీ, కెనరా బ్యాంక్ దగ్గర, లక్సా రోడ్, వారణాసి వారి సంస్థ కార్యాలయం ద్వారా ప్రొవిజనల్ మెంబర్‌షిప్ జాబితా (28471 సభ్యులు) విడుదలచేయబడినది. ఒకవేళ ఎవరైన పార్టీ పై జాబితాలో ఏమైనా అభ్యంతరాలు కలిగియున్నచో, వారు 15 రోజుల్లోగా క్రింది సంతకందారుని కార్యాలయంలో ఫోటో తో నోటరీ అఫ్డివిట్ ద్వారా కాంక్రీట్ రుజువులు& ఎవిడెన్స్‌తోపాటు అభిప్రాయంను సమర్పించవలసిందిగా కోరబడుచున్నది. సదరు కాలవ్యవధి తరువాత ఏదైనా అభ్యంతరం స్వీకరించబడదు.

గమనిక: పై ప్రొవిజనల్ మెంబర్‌షిప్ జాబితా (28471 సభ్యులు)ను చూచుట కొరకు సంస్థ యొక్క నోటీసు బోర్డు పై అతికించబడినది.

ఆదేశానుసారం
అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఫర్మ్స్ సొసైటీస్ & చిట్స్ వారణాసి డివిజన్, వారణాసి

2న కళారూపాలతో కార్నివాల్

- ఘనంగా రాష్ట్రావతరణ వేడుకలు
- పరేడ్ మైదానంలో రాష్ట్ర గీతాన్ని ఆవిష్కరించనున్న సిఎం
- ఏర్పాట్లపై సిఎస్ సమీక్ష

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర అవతరణ ఉత్సవాల సందర్భంగా జూన్ రెండున హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్‌పై రాత్రి 7 నుంచి 9 గంటల వరకు అన్ని రకాల కళారూపాలతో పెద్ద ఎత్తున కార్నివాల్‌ను నిర్వహించనున్నట్టు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి వెల్లడించారు. అదే రోజు శిక్షణ పొందిన ఐదు వేల మంది పోలీసు అధికారులు బ్యాండ్ ప్రదర్శనలో పాల్గొంటారని ఆమె తెలిపారు. ట్యాంక్‌బండ్‌పై దాదాపు 80 రకాల స్టాళ్లను ఏర్పాటు చేస్తామని వివరించారు. హస్త కళలు, చేనేత, స్వయం సహాయక బృందాలు తయారు చేసిన వస్తువులతోపాటు నగరంలో పేరొందిన హోటళ్ల ద్వారా ఫుడ్ స్టాళ్లనూ ఏర్పాటు చేయనున్నట్టు పేర్కొన్నారు. రాష్ట్రావతరణ దినోత్సవ ఏర్పాట్లపై సోమవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో సిఎస్ ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. జూన్ రెండు ఉదయం గన్‌పార్కులోని అమరవీరుల స్థూపానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నివాళులర్పిస్తారని చెప్పారు. అనంతరం సికింద్రాబాద్‌లోని పరేడ్ మైదానంలో నిర్వహించే కార్యక్రమంలో ఆయన పాల్గొంటారని వివరించారు. ఆ సందర్భంగా సిఎం...రాష్ట్ర గీతాన్ని ఆవిష్కరించి, ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారని తెలిపారు. అదే రోజు రాత్రి ట్యాంక్‌బండ్‌పై నిర్వహించే వేడుకలకు హాజరయ్యే పౌరులు, పిల్లల కోసం పలు క్రీడలతో కూడిన వినోదశాలనూ ఏర్పాటు చేస్తామని ఆమె పేర్కొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాల అనంతరం ఆకర్షణీయమైన బాణాసంచా ప్రదర్శనతోపాటు లేజర్ షో కూడా ఉంటుందని వెల్లడించారు. వీటిని తిలకించేందుకు విచ్చేసే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలంటూ సిఎస్ ఉన్నతాధికారులను ఆదేశించారు. రాష్ట్రావతరణ ఉత్సవాల సందర్భంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించాలని సూచించారు. సమీక్షా సమావేశంలో డిజిపి రవిగుప్తా, ప్రభుత్వ ముఖ్య కార్యదర్శులు దాన కిశోర్, శైలజా రామయ్యార్, శ్రీనివాసరాజు, సాధారణ పరిపాలనశాఖ కార్యదర్శి రఘునందన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న సిఎస్ శాంతికుమారి

పరేడ్ గ్రౌండ్‌ను సందర్శించిన సిఎస్

రాష్ట్రావతరణ దినోత్సవ ఏర్పాట్లపై పరిశీలన

తెలంగాణ రాష్ట్రావతరణ దినోత్సవ ఏర్పాట్లను సోమవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి పరిశీలించారు. కార్యక్రమం నిర్వహించనున్న పరేడ్‌గ్రౌండ్‌ను సందర్శించి అధికారులకు పలు సూచనలు చేశారు. సభాప్రాంగణంలో ఏలాంటి లోటుపాట్లు లేకుండా కార్యక్రమం సజావుగా సాగేందుకు అన్ని శాఖల అధికారలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. స్టేజీ ఏర్పాట్లు, బారికేడ్లు, సభాప్రాంగణంలో విద్యుత్, మంచినీటి సరఫరా, మైక్‌సిస్టం, ఎల్ఇడి స్క్రీన్‌ల ఏర్పాట్ల వివరాలను ఆయా శాఖల అధికారులను ఆమె అడిగి తెలుసుకున్నారు.

బందోబస్తు, ట్రాఫిక్ అంతరాయం కలుగకుండా పార్కింగ్ ఏర్పాట్లు, విఐపీ రాకపోకలకు ఇబ్బందులు కలుగకుండా చేపట్టబోయే చర్యపై వివరాలను పోలీసు అధికారులకు దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో డిజిపి రవీగుప్తా, ప్రభుత్వ ముఖ్య కార్యదర్శులు శైలజా రామయ్యార్, శ్రీనివాసరాజు, జిఎడి కార్యదర్శి రఘునందన్ రావు, అడిషనల్ డీజీలు సంజయ్ కుమార్, సమాచార శాఖ ప్రత్యేక కమీషనర్ హనుమంతరావు, తదితర అధికారులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో ఎన్‌పిఆర్‌డి నాలుగో రాష్ట్ర మహాసభ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పిఆర్‌డి) రాష్ట్ర నాలుగో మహాసభను ఆగస్టులో గ్రేటర్ హైదరాబాద్ నిర్వహించాలని ఆ సంఘం రాష్ట్ర కమిటీ నిర్ణయించింది. సోమవారం హైదరాబాద్‌లోని రాష్ట్ర కార్యాలయంలో అధ్యక్షులు కె వెంకట్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. రాష్ట్ర మహాసభల నిర్వహణ కోసం జూన్ 11న ఆహ్వాన సంఘాన్ని ఏర్పాటు చేస్తున్నట్టు ఎన్‌పిఆర్‌డి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం అడివయ్య తెలిపారు. కవి, రచయిత, బధిరుల ఆశాజ్యోతి హెలెన్ కెల్లర్ 144వ జయంతి ఉత్సవాలను రాష్ట్ర వ్యాప్తంగా జరపనున్నట్టు పేర్కొన్నారు. జూన్ 27న రాష్ట్ర స్థాయి వికలాంగుల సాంస్కృతిక ఉత్సవాలను హైదరాబాద్‌లో నిర్వహిస్తున్నామని తెలిపారు. సమావేశంలో రాష్ట్ర కోశాధికారి ఆర్ వెంకటేష్, రాష్ట్ర ఉపాధ్యక్షులు జె.రాజు, అరిఫా, సాయమ్మ, బి స్వామి, రాష్ట్ర సహాయ కార్యదర్శి వి ఉపేందర్, రాష్ట్ర కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

ఓటు వేసి వస్తుండగా రోడ్డుప్రమాదం

- దంపతులు మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం-ఇల్లందు ప్రధాన రహదారిలోని టేకులపల్లి మండల సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో దంపతులు మృతి చెందిన సంఘటన సోమవారం జరిగింది. టేకులపల్లి ఎస్ఐ సైదా రాహుప్ తెలిసిన వివరాల ప్రకారం.. సంపత్ నగర్ గ్రామానికి చెందిన పాయం కృష్ణ (42), జానకి (40) దంపతులు ఎమ్మెల్సీ ఓటు వేసేందుకు గ్రామం నుంచి టేకులపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రానికి వచ్చారు. ఓటు హక్కును వినియోగించుకొని తిరిగి బైక్‌పై వెళ్తుండగా కొత్తగూడెం నుంచి ఎదురుగా వస్తున్న కారు వీరి బైక్‌ను ఢీకొట్టింది. దాంతో దంపతులిద్దరికీ బలమైన గాయాలు కావడంతో కొత్తగూడెం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పరీక్షించిన వైద్యులు వారు మృతి చెందినట్టు తెలిపారు. దంపతులకు పాప ఉంది. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు పోలీసులు చెప్పారు.

యుపిఎస్‌సి అభ్యాస్ ప్రిలిమ్స్ నిర్వహణ

- విజన్ ఐఎఎస్ వెల్లడి

హైదరాబాద్ : ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ టీచింగ్‌లోని సంస్థ అయిన విజన్ ఐఎఎస్ దేశంలోని 100కిపైగా నగరాల్లో యుపిఎస్‌సి అభ్యాస్ ప్రిలిమ్స్ నిర్వహిస్తున్నట్లు వెల్లడించింది. హైదరాబాద్‌లో ఈ పరీక్షను ఆదివారం ఎవి కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్, సైన్స్ అండ్ కామర్స్‌లో ఏర్పాటు చేసినట్లు తెలిపింది. ఇందుకోసం వెయ్యి కంటే ఎక్కువ మంది విద్యార్థులు నమోదు చేసుకున్నారని పేర్కొంది.. దేశవ్యాప్తంగా 28,000 మందికిపైగా దీనిలో పాల్గొన్నారని అంచనా వేసింది. యుపిఎస్‌సి ప్రిలిమ్స్ పరీక్ష యుపిఎస్‌సి సివిల్ సర్వీసెస్ పరీక్ష ప్రయాణానికి నాంది పలికుతుందని ఆ సంస్థ పేర్కొంది.

నేటి నుంచి సూత్ర సమ్మర్ స్పెషల్ ఎగ్జిబిషన్

హైదరాబాద్ : సంస్కృతి సంప్రదాయాలు, ఆధునిక ఫ్యాషన్ల ప్రతిబింబించే వస్త్ర ప్రపంచం ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు సూత్రా సంస్థ పేర్కొంది. మే 28 నుంచి 30 వరకు నోవాటెల్ హెచ్ఐసిసి నందు తమ సూత్రా ఎగ్జిబిషన్‌లో జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. సందర్శకుల అభిరుచులను అనుసరించి దేశం నలుమూలల నుండి తెచ్చిన విభిన్న వస్త్ర సంపదను ఒకే వేదికపైన ప్రదర్శన, విక్రయాలకు ఉంచుతున్నామన్నారు. ఈ ప్రదర్శనలో ఎందరో కళాకారులు, చేనేత పనివారు డిజైనర్స్ అద్భుతంగా రూపొందించిన విస్తృత శ్రేణీ దుస్తులు, గృహాలంకరణ ఉత్పత్తులు, పాదరక్షలు సందర్శకులకు అందుబాటులో ఉంటాయన్నారు.

కార్పొరేట్ హంగులతో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు

- ఉద్యోగ ఖాళీల భర్తీకి సన్నాహాలు
- రిజిస్ట్రేషన్లకు వచ్చే వారికి సకల సౌకర్యాలు
- ఆదాయం పెరిగేలా అన్ని రకాల చర్యలు : సిఎం రేవంత్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను కార్పొరేట్ హంగులతో అధునాతనంగా నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు సంబంధించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోమవారం హైదరాబాద్‌లో సంబంధిత అధికారులతో అంతర్గత సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో రిజిస్ట్రేషన్ శాఖ పని తీరు, మౌళిక వసతులు, ఉద్యోగ ఖాళీలు తదితర అంశాలను ఈ సందర్భంగా సీఎం అధికారులను అడిగి తెలుసుకున్నారు.

రాష్ట్ర ఖజానాకు పెద్ద మొత్తంలో ఆదాయాన్ని అందిస్తున్న ఆ శాఖను మరింత పటిష్టపరచాలని ఈ సందర్భంగా సిఎం అధికారులకు సూచించారు. రిజిస్ట్రేషన్లకు వచ్చేవారికి కూర్చోడానికి కనీసం కుర్చీలు కూడా లేక పోవడంతో చెట్ల కింద, నీడ దొరికిన చోట నిరీక్షిస్తున్నారనీ, ఇకపై ఆ పరిస్థితి ఉండకూడదని సిఎం అన్నారు. అన్ని సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులను మోడల్ రిజిస్ట్రేషన్ ఆఫీసులుగా తీర్చిదిద్దాలని ఆదేశించారు. "రాష్ట్రంలో మొత్తం 144 సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులున్నాయి. వీటిలో 38 ఆఫీసులు మాత్రమే సొంత భవనాల్లో ఉన్నాయి. ఆదిలాబాద్‌లో బోథ్, మేడ్చల్ జిల్లా షామీర్‌పేటలో కొత్తగా నిర్మించిన కార్యాలయాలు ఎన్నికల కోడ్ తర్వాత ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి. మిగతా 104 ఆఫీసులు అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. 52 చోట్ల ఆఫీసులకు అవసరమయ్యే భవనాల నిర్మాణానికి ప్రభుత్వ భూమి కేటాయించింది" అని సిఎంకు అధికారులు వివరించారు. భూములు సిద్ధంగా ఉన్న చోట వీలైనంత త్వరగా మోడల్ రిజిస్ట్రేషన్ ఆఫీసులను నిర్మించాలనీ, మిగతా 52 సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులకు సరిపడే స్థలాలను అన్వేషించాలని ఈ సందర్భంగా అధికారులను ఆదేశించారు. పబ్లిక్ యుటిలిటీ కింద సేకరించిన స్థలాలు అందుబాటులో ఉంటే అక్కడే నిర్మాణాలు చేపట్టాలని సూచించారు.

ఆదాయం వచ్చే ఆఫీసులపై ఫోకస్

ఆదాయం ఎక్కువగా తెచ్చిపెడుతున్న రంగారెడ్డి, మేడ్చల్, హైదరాబాద్, సంగారెడ్డి జిల్లాల పరిధిలోని సబ్ రిజిస్ట్రార్ ఆఫీసుల నిర్మాణాలకు మొదటి దశలో ప్రాధాన్యమివ్వాలని సీఎం సూచించారు. అక్కడికి వచ్చే క్రయ విక్రయదారులు తమ రిజిస్ట్రేషన్ ప్రక్రియ ముగిసే వరకు మంచి ఆతిథ్యమిచ్చేలా సౌకర్యాలు ఉండాలనీ, వెయిటింగ్ హాల్, డ్రింకింగ్ వాటర్, కెఫేటెరియా లాంటి అన్ని సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. ఎక్కువ రిజిస్ట్రేషన్లు జరిగే చోట సిబ్బంది కొరత లేకుండా చూడాలనీ, ఆదాయం తక్కువగా ఉన్న జిల్లాల ఆఫీసుల నుంచి ఎక్కువ పని ఉన్న చోటికి సిబ్బందిని సర్దుబాటు చేసేందుకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

భూముల ధరల పెంపుపై చర్చ

భూముల ధర పెంపుపై ఈ సందర్భంగా సీఎం అధికారులకు పలు సూచనలు చేసినట్టు సమాచారం. హైదరాబాద్‌తో పాటు రాష్ట్ర వ్యాప్తంగా భూములు, స్థిరాస్తుల ధరలు భారీగా పెరిగినా, అదే స్థాయిలో రెవెన్యూ ఆదాయం ఎందుకు పెరుగడంలేదని అధికారులను ఆయన ప్రశ్నించారు. "గత ప్రభుత్వం 2021లో భూముల విలువను, రిజిస్ట్రేషన్ ఛార్జీలను పెంచింది. ఇప్పటికీ చాలాచోట్ల భూముల మార్కెట్ విలువకు, క్రయ విక్రయ ధరలకు భారీ తేడా ఉంది. ఫలితంగా రాష్ట్ర ఖజానాకు పెద్దమొత్తంలో గండి పడుతున్నది" అని అధికారులు సీఎంకు వివరించారు. ఈ క్రమంలో నిబంధనల ప్రకారం ఏడాదికోసారి భూముల మార్కెట్ విలువను సవరించాల్సి ఉన్న నేపథ్యంలో తగిన చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. వ్యవసాయ భూములు, ఖాళీ స్థలాలు, ప్లాట్లు, అపార్ట్మెంట్లకు సంబంధించి వేటికి ఎంత సవరించాలనేదాన్ని శాస్త్రీయంగా నిర్ధారించి నిబంధనల ప్రకారం పెంచాలని చెప్పారు. ఇతర రాష్ట్రాల్లో అమలవుతున్న స్టాంప్ డ్యూటీ విధానాన్ని కూడా అధ్యయనం చేయాలనీ, ఆదాయం పెరిగేలా ఉద్యోగులు నిబద్దతతో పని చేయాలని సీఎం సూచించారు.

హెటిరో ల్యాబ్స్‌లో మంటలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సంగారెడ్డి జిల్లా గడ్డపోతారం పారిశ్రామికవాడలోని హెటిరో పరిశ్రమలో సోమవారం ఒక్కసారిగా మంటలు ఎగిసిపడటంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. పరిశ్రమలోని హెడ్ రోలాక్స్ ఈటీపీ ప్రాంతంలో మంటలు చెలరేగడంతో అక్కడున్న రసాయనాలతో పెద్ద ఎత్తున మంటలు ఎగిసిపడ్డాయి. దాంతో అప్రమత్తమైన కార్మికులు, స్థానికులు.. అగ్నిమాపక కేంద్రాలకు సమాచారం ఇవ్వడంతో స్థానిక పారిశ్రామికవాడకే చెందిన పరిశ్రమల నుంచి రెండు, నర్సాపూర్ జీడిమెట్ల ప్రాంతం నుంచి మరో రెండు ఫైర్ ఇంజన్లు ఘటనా స్థలానికి చేరుకున్నాయి. ఫైర్ సిబ్బంది, సేఫ్టీ విభాగం యంత్రాంగం, ఫైర్ ఇంజన్లు, ఫోమ్ ద్వారా మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఈ ప్రమాదంలో ప్రాణనష్టం జరగకపోవడంతో స్థానికులు, కార్మికులు ఊపిరిపీల్చుకున్నారు. కాగా, ఈ ప్రమాద ఘటనపై హెటిరో పరిశ్రమ హెచ్‌ఆర్ ప్రతినిధి రవికుమార్ మాట్లాడుతూ.. ప్రమాదం ఎలా జరిగిందనేది తెలియరాలేదన్నారు. ప్రమాదంపై విచారణ చేపట్టినట్టు చెప్పారు. అకస్మాత్తుగా చోటుచేసుకున్న ప్రమాదంపై ఫైర్ డిపార్ట్‌మెంట్, పోలీస్ డిపార్ట్‌మెంట్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ చీఫ్ విభాగం, సంబంధిత ప్రభుత్వ శాఖ అధికారులకు సమాచారం అందించామని తెలిపారు. జిన్నారం మండలంలోని వివిధ పారిశ్రామికవాడల్లో తరచుగా ప్రమాదాలు సంభవిస్తున్నా.. సంబంధిత అధికార యంత్రాంగం తగిన జాగ్రత్తలు, నిఘా వ్యవస్థను ఎందుకు ఏర్పాటు చేయడం లేదంటూ స్థానికులు ప్రశ్నిస్తున్నారు. భద్రతాపరమైన అంశాలు, ప్రమాద నివారణా కార్యక్రమాలు, ఉత్పత్తుల ప్రక్రియ, ఉత్పత్తుల నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నైపుణ్యంతో కూడిన శ్రామిక శిక్షణ ఇతరత్రా అంశాలపై పారిశ్రామిక రంగానికి సంబంధించిన వివిధ రకాల విభాగాలు మరింతగా దృష్టి సారించాలని కోరుతున్నారు.

భూ వివాదంతో కత్తులతో దాడి

- యువకుడు మృతి, మరో వ్యక్తికి తీవ్రగాయాలు
- సంగారెడ్డి జిల్లాలో ఇరుగ్రూపుల మధ్య ఘర్షణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భూ వివాదంలో ఇరు కుటుంబాల మధ్య ఘర్షణ జరగ్గా.. ఓ గ్రూపు వారు కత్తులతో దాడి చేయడంతో యువకుడు మృతి చెందాడు. మరో వ్యక్తి తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్నాడు. ఈ ఘటన సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మున్సిపాల్టీ పరిధిలోని చాంద్‌ఖాన్‌పల్లిలో సోమవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. అంకం లక్ష్మయ్య, బాబుకొండ మల్లయ్య కుటుంబ సభ్యుల మధ్య చాంద్‌ఖాన్‌పల్లి శివారులో ఉన్న అసైన్డ్ భూ వివాదం 20 ఏళ్లుగా కొనసాగుతుండగా.. కోర్టులో కేసు నడుస్తుంది. కాగా, బాబుకొండ మల్లయ్య కుటుంబ సభ్యులు సోమవారం వివాదంలో ఉన్న భూమిలో చెట్లు నరికారు. ఈ విషయం తెలుసుకున్న అంకం లక్ష్మయ్య, కుమారుడు అశోక్‌తోపాటు రాములు ముగ్గురు కలిసి అక్కడికి వెళ్లారు. ఈ క్రమంలో ఇరు కుటుంబ సభ్యుల మధ్య మాటామాటా పెరిగి తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. ఈ క్రమంలో బాబుగొండ మల్లయ్య కత్తులతో దాడి చేయగా.. అంకం అశోక్ అక్కడికక్కడే మృతి చెందాడు. అంకం రాములు తీవ్రంగా గాయపడగా సంగారెడ్డి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

9.72 క్వింటాళ్ల నకిలీ పత్తి విత్తనాల పట్టివేత

- వికారాబాద్ జిల్లా కొడంగల్‌లో ఘటన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వికారాబాద్ జిల్లా కొడంగల్ మండలం హస్నాబాద్‌లో 9.72 క్వింటాళ్ల నకిలీ పత్తి విత్తనాలను పోలీసులు పట్టుకున్నారు. వ్యవసాయ శాఖ, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో విశ్వనీయంగా అందిన సమాచారం మేరకు దాడులు నిర్వహించి నకిలీ పత్తి విత్తనాలను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ.16.77 లక్షలు ఉంటుంది. ఎస్ఐ భరత్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని ప్రకాశం జిల్లా ఇడుపులపాడు గ్రామానికి చెందిన వేణుబాబు 20 ఏండ్లుగా కోస్గి మండలం సర్జఖాన్‌పేటలో నివాసం ఉంటున్నాడు. అదే గ్రామానికి చెందిన హనుమయ్యతో కలిసి నకిలీ విత్తనాలు రైతులకు అమ్ముతున్నాడు. ఈ క్రమంలో హనుమయ్య మామ అయిన హస్నాబాద్ గ్రామానికి చెందిన బోయిని ఆశప్ప ఇల్లు అద్దెకు తీసుకున్నారు. ఆ ఇంట్లోనే నకిలీ పత్తి విత్తనాలను నిల్వ ఉంచారు. కాగా, విశ్వసనీయ సమాచారం మేరకు ఏవో లావణ్య, ఎస్ఐ భరత్‌రెడ్డి తమ సిబ్బందితో కలిసి సోమవారం హస్నాబాద్‌లో సోదాలు నిర్వహించారు. హనుమయ్య, వేణుబాబులను పట్టుకుని విచారించగా.. హస్నాబాద్ పరిసర ప్రాంతాల్లోని రైతులకు ఎక్కువ ధరకు నకిలీ పత్తి విత్తనాలు అమ్మాలనే ఉద్దేశంతో బోయిని ఆశప్ప ఇంట్లో అద్దె రూము తీసుకుని నకిలీ విత్తనాలు నిల్వ ఉంచినట్టు వారు ఒప్పుకున్నారు. నకిలీ పత్తి విత్తనాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మండల వ్యవసాయ అధికారి లావణ్య పంచనామా నిర్వహించి, ఎస్ఐ భరత్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. హనుమయ్య, వేణుబాబులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. వేణుబాబు గతంలో కూడా నకిలీ పత్తి విత్తనాల వ్యాపారం చేశాడు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం సూచించిన విత్తనాలు మాత్రమే రైతులు వాడాలని సూచించారు. నకిలీ పత్తి విత్తనాలు నిల్వ చేసినా, అమ్మినా వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

తెలంగాణలో కొత్త బీర్లు

- త్వరలో అందుబాటులోకి పవర్ 1000, బ్లాక్ ఫోర్ట్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో కొత్త బీర్లు రాబోతున్నాయి బీర్ల కొరతను నివారించేందుకు సర్కార్ కొత్తగా సోమ్ డిస్టలరికి అనుమతిచ్చినట్టు సమాచారం. ఈ క్రమంలో ఆ కంపెనీ ఉత్పత్తి చేస్తున్న పవర్ 1000, బ్లాక్ ఫోర్ట్, హంటర్, వుడ్ పీకర్ బీర్లు త్వరలో అందుబాటులోకి రానున్నాయి. రెండు నెలలుగా రాష్ట్రంలో బీర్లు అందుబాటులో ఉండటం లేదని పలువురు ఫిర్యాదులు చేసిన నేపథ్యంలో సర్కార్ ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తున్నది. అయితే ప్రభుత్వ వాదనను ప్రతిపక్షాలు తిప్పకొడుతున్నాయి. ఇప్పటికే అనుమతిపొంది, సరఫరా చేస్తున్న కంపెనీల ఉత్పత్తులను తగ్గించి కమీషన్ల కోసం కొత్త వాటికి అనుమతిస్తున్నారని వారు ఆరోపిస్తున్నారు. రాష్ట్రంలో కొత్త బీర్లకు ఏ డిస్టిలరీ కంపెనీ దరఖాస్తు చేయలేదనీ, ఇప్పటి వరకు ఎవరికీ అనుమతివ్వలేదని ఇటీవల అబ్కారీ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. మంత్రి చెప్పిన నాలుగు రోజులకే రాష్ట్రంలో కొత్తగా బీర్లను ఉత్పత్తి చేసే డిస్టలరీ సంస్థకు అనుమతినివ్వడం కొసమెరుపు.

ప్రజా సమస్యలు పట్టని సిఎం

ఎన్‌విఎస్ఎస్ ప్రభాకర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రేవంత్‌రెడ్డి నామ్‌కే వాస్తే ముఖ్యమంత్రిగా మారారని బిజెపి మాజీ ఎమ్మెల్యే ఎన్‌విఎస్ఎస్ ప్రభాకర్ విమర్శించారు. సోమవారం హైదరాబాద్‌లోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రజా సమస్యలపైనా, ప్రభుత్వ శాఖల్లో జరుగుతున్న అవినీతిపైన ఆయన ఎందుకు నోరువిప్పడం లేదని ప్రశ్నించారు. శాఖలవారీగా సీఎం పెడుతున్న సమీక్షలకు సంబంధిత శాఖల మంత్రులే రావడం లేదన్నారు. అధిష్టానానికి మాత్రమే తాము జిమ్మేదారి అన్నట్టుగా అమాత్యులు వ్యవహరిస్తున్నారన్నారని ఎద్దేవా చేశారు.

మీడియాతో మాట్లాడుతున్న కెటిఆర్

చిన్నారి మృతి బాధాకరం : కెటిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఈదురు గాలులతో కూడిన వర్షానికి రేకులు కూలి చిన్నారి మృతిచెందడం చాలా బాధాకరమని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కెటిఆర్ అన్నారు. రంగారెడ్డి జిల్లా హఫీజ్‌పేట డివిజన్ వరిధిలోని సాయినగర్ కాలనీలో శనివారం సాయంత్రం కురిసిన వర్షానికి పెంట్ హౌస్‌పైన ఉన్న రేకుల షెడ్డు కూలిన ఘటనలో మూడేళ్ల నమద్ మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కెటిఆర్ సోమవారం స్థానిక ఎమ్మెల్యే అరికపూడి గాంధీతో కలిసి సాయినగర్‌లోని బాధిత ఇంటికి వెళ్లారు. ముందుగా చిన్నారి మృతదేహానికి నివాళి అర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించి.. రూ.లక్ష ఆర్థిక సాయం చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ.. చిన్నారి మృతి చెందిన ఘటన చాలా దురదృష్టకరమని అన్నారు. బాలుని మృతి తనను ఎంతగానో కలిచి వేసిందని, చిన్నారి కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని తెలిపారు. ఇదే ఘటనలో మరో వ్యక్తి కూడా చని పోవడం బాధాకరం అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 14 మంది మృతి చెందారని, వారందరికీ బిఆర్ఎస్ అండగా ఉంటుందని చెప్పారు. వర్షాకాలం ప్రారంభం కాకముందే ఇలాంటి సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ప్రాణనష్టం జరిగిన కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని, బాధిత కుటుంబాలకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇంటి రేకులు కూలిన వారి కుటుంబాలను జిహెచ్ఎంసి నైట్ షెల్టర్లకు తరలించాలన్నారు. పరామర్శించిన వారిలో మియాపూర్, లింగంపల్లి డివిజన్ల కార్పొరేటర్లు ఉప్పలపాటి శ్రీకాంత్, రాగం నాగేందర్‌యాదవ్, బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ఉపాధి పేరుతో మోసం

- కష్టాలను వీడియో ద్వారా బయటపెట్టిన బాధితుడు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

విదేశాల్లో ఉద్యోగం వచ్చిందని సంతోషంతో ఆస్ట్రేలియాకు బయలుదేరిన అతన్ని కంబోడియాకు పంపింది ఏజెన్సీ.. అక్కడ అతడు పడుతున్న కష్టాలను వీడియో రూపంలో సోషల్‌మీడియాలో పోస్ట్ చేయడంతో వెలుగులోకి వచ్చింది. మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలంలోని కొత్తపేట గ్రామానికి చెందిన ప్రకాశ్.. హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. విదేశాల్లో ఉద్యోగం చేయాలన్న ఆశతో మూడు నెలల క్రితం హైదరాబాద్‌లోని ఓ ప్రయివేటు ఏజెన్సీని సంప్రదించాడు. ఏజెన్సీ వాళ్లు ఆస్ట్రేలియా అని చెప్పి బ్యాంకాక్‌కు.. అక్కడి నుంచి కంబోడియాకు తీసుకెళ్లారు. అక్కడ మూడు రోజులకు ఒక పూట తిండి పెడుతూ, మత్తు ఇంజెక్షన్లు చేసి, బెల్టుతో కొడుతూ, షాక్ ట్రీట్మెంట్ ఇస్తున్నారని బాధితుడు సెల్ఫీ వీడియోల ద్వారా తెలిపాడు. రెండు రోజుల క్రితం ప్రకాశ్‌ను కంబోడియా పోలీసులు అదుపులోకి తీసుకొన్నట్టు తెలిసింది. తనను ఆదుకోవాలని, అక్కడ వాళ్లు తనని చిత్రహింసలు పెడుతున్నారని ప్రకాష్ ఓ వీడియో ద్వారా తన అన్న ప్రశాంత్‌కు సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. దాంతో ఈ వార్త మండలంలో చర్చనీయాంశంగా మారింది. కాగా, ప్రకాశ్ తల్లిదండ్రులు చనిపోగా, అతనికి అన్న, చెల్లి ఉన్నారు.

మీడియాతో మాట్లాడుతున్న జగదీశ్ రెడ్డి

ఓటమి భయంతోనే కాంగ్రెస్ డబ్బుల పంపిణీ

- రాష్ట్రంలో ప్రజాస్వామ్యం లేదు.. పోలీసు రాజ్యం నడుస్తోంది : జగదీశ్ రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో ఓటమి భయంతోనే కాంగ్రెస్ డబ్బులు పంచి ఓటర్లను ప్రలోభాలకు గురిచేసిందని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్ రెడ్డి అన్నారు. సోమవారం పట్టభద్రుల ఎన్నికల సందర్భంగా నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఎన్‌జి కళాశాలలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యం లేదని.. పోలీస్ రాజ్యం నడుస్తోందని ఆరోపించారు. ఎలాగైనా గెలవాలని కాంగ్రెస్ అరాచకాలు చేసిందన్నారు. ప్రశ్నించే వారిపై దాడులు చేస్తూ భయాందోళనకు గురి చేస్తుందని విమర్శించారు. గ్రాడ్యుయేట్ ఎన్నికలో కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పేందుకు ఓటర్లు నడుం బిగించారని తెలిపారు. ఇప్పుడు భ్రమలు అన్ని తొలగిపోయాయని.. ఈ ఎన్నికల్లో ప్రభుత్వ వ్యతిరేకత స్పష్టంగా కనిపిస్తోందని అన్నారు. బిఆర్ఎస్ అభ్యర్థికి మద్దతు పెరిగిందన్నారు. పోలీసులు నిష్పక్షపాతంగా నడుచుకోవాలన్నారు. పోలీసులు కాంగ్రెస్ కార్యకర్తలుగా పని చేస్తున్నారని విమర్శించారు. ఇవన్నీ ప్రజలు గమనిస్తున్నారన్నారు. గ్రాడ్యుయేట్ ఓటర్లు తెలివితో ఓటు హక్కు వినియోగించుకుంటున్నారని తెలిపారు. ఈ సమావేశంలో నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి, కౌన్సిలర్ అభిమన్యు శ్రీనివాస్, నాయకులు లోడంగి గోవర్ధన్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

ఎసిబికి చిక్కిన ఎఒ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

విత్తన డీలర్ లైసెన్సును రెన్యువల్ చేయడానికి ఆసిఫాబాద్ జిల్లా దహెగాం మండల వ్యవసాయ శాఖ అధికారి డబ్బులు తీసుకుంటూ ఎసిబికి చిక్కాడు. సోమవారం ఫెర్టిలైజర్ రెన్యూవల్ కోసం రూ.38 వేలు లంచం తీసుకుంటూ మండల వ్యవసాయ అధికారి వంశీకృష్ణ పట్టుబడడం సంచలనం సృష్టిస్తోంది. ఎసిబి కరీంనగర్ రేంజ్ డిఎస్‌పి వివి రమణమూర్తి తెలిపిన వివరాల ప్రకారం.. ఐనం గ్రామానికి చెందిన చౌదరి శ్యామ్‌రావు తనకున్న మారుతి ట్రేడర్స్‌లో ఫెర్టిలైజర్, సీడ్స్ రెన్యూవల్ కోసం గత నెల 27న ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నాడు. ఈ నెల 7న ఫెర్టిలైజర్ లైసెన్స్ రెన్యూవల్ కాగా.. సీడ్స్ లైసెన్స్‌లో అడ్రెస్ తప్పుగా పడింది. అప్పటికే రెన్యువల్ కోసం మండల వ్యవసాయ అధికారి వంశీకృష్ణ లంచం డిమాండ్ చేశారు. అయితే, అడ్రెస్ తప్పును సవరించాలని తిరిగి బాధితుడు శ్యామ్‌రావు వ్యవసాయ అధికారిని సంప్రదించగా.. ఫెర్టిలైజర్ లైసెన్స్ రెన్యూవల్‌కు రూ.20 వేలు, సీడ్ లైసెన్స్ రెన్యూవల్‌కు రూ.18 వేలు మొత్తం రూ.38 వేలు ఇస్తేనే అడ్రస్ సరిచేస్తానన్నాడు. చేసేదేం లేక అందుకు ఒప్పుకున్న బాధితుడు ఎసిబి అధికారులను సంప్రదించాడు. సోమవారం బాధితుడి నుంచి మండల కేంద్రంలో వ్యవసాయ అధికారి రూ.38 వేలు తీసుకుంటుండగా ఎసిబి అధికారులు పట్టుకున్నారు. ఈ దాడిలో ఎసిబి కరీంనగర్ రేంజ్ ఇన్‌స్పెక్టర్ కృష్ణకుమార్, హెడ్ కానిస్టేబుల్ వేణుగోపాల్ పాల్గొన్నారు.